బుధవారం సికింద్రాబాద్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వేముల మారయ్య

రేవంత్‌రెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకో

- కేసీఆర్ తెలంగాణ యోధుడు
- ఆయన్ను ఒక్కమాటన్నా సహించం
- ఆటోడ్రైవర్ల సమావేశంలో టీఏటీయూ అధ్యక్షుడు మారయ్య

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణ యోధుడు కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి నోరు పారేసుకోవడం సరికాదని టీఏటీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య పేర్కొన్నారు. నోరు అదుపులో పెట్టుకోకుంటే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. సికింద్రాబాద్‌లోని ప్లాట్‌ఫాం నంబర్-10లో ఆటోకార్మికుల సంఘం ఆధ్వర్యంలో 200 మంది ఆటోడ్రైవర్లతో బుధవారం విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మారయ్య మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో ఆటోడ్రైవర్లకు రక్షణ ఉండేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వారిని బలిపశువులను చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళలకు ఉచిత బస్సు పథకం తీసుకొచ్చి ఆటోడ్రైవర్ల కుటుంబాలను రోడ్డుపాలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పోలె నిరంజన్, ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆటోడ్రైవర్ల నూతన అధ్యక్షుడు రమేశ్, నీజర్, సిద్దులు, కమ్మర్, శీను, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సరళీకృత పారిశ్రామిక విధానం

- పెట్టుబడులను ఆకర్షించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం
- రాష్ట్రంలో ఐటీ వృద్ధి కొనసాగింపునకు చర్యలు
- టెలీ పెర్ఫార్మెన్స్ ఇంప్రెసివ్ ఎక్స్‌పీరియన్స్ సమ్మిట్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆకర్షించేందుకు త్వరలో సరళీకృత పారిశ్రామిక విధానాన్ని తీసుకొస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఐటీ రంగంలో వృద్ధిని కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. బుధవారం ఆయన మాదాపూర్‌లోని ఐటీసీ కోహినూర్‌లో జరిగిన టెలీ పెర్ఫార్మెన్స్ ఇంప్రెసివ్ ఎక్స్‌పీరియన్స్ సమ్మిట్‌లో మాట్లాడుతూ.. 1990వ దశకంలో నాటి ప్రధాని పీవీ నరసింహారావు హైదరాబాద్‌లో ఐటీ ఇండస్ట్రీకి అంకురార్పణ చేశారని, ఆ తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఆ పరిశ్రమ వృద్ధికి కృషిచేశాయని చెప్పారు. భారత్‌లో ఇండస్ట్రీ స్థాపనకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవాలని టెలీ పెర్ఫార్మెన్స్ గ్రూప్ వ్యవస్థాపకులు డానియల్ జూలియన్, సీఈవో అనీశ్ ముక్కర్‌ను కోరారు. హైదరాబాద్‌లో పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనువైన వాతావరణంతోపాటు మానవ వనరులు, మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 165 ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయని, కొత్తగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నదని వెల్లడించారు. ఐఎస్‌బీ తరహాలో నైపుణ్యతతో కూడిన మానవ వనరులను అందించే ఈ వర్సిటీ స్థాపనకు టాటా, మహీంద్రా కంపెనీలు ముందుకొచ్చాయని చెప్పారు. ఉత్తమ నివాసయోగ్య నగరంగా పేరుగాంచిన హైదరాబాద్ నుంచి దేశంలోని ఏ మెట్రో నగరానికైనా కేవలం 2 గంటల్లో చేరుకోవచ్చని, ఇక్కడ భూకంపాలు వచ్చే ఆస్కారం లేదని వివరించారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధిపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందని, ఈ రంగంలో వృద్ధి రేటును 20 శాతానికి పెంచాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నదని తెలిపారు. హైదరాబాద్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో జూన్‌లో గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమ్మిట్‌ను నిర్వహించనున్నామని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని ఏఐ కంపెనీలను ఈ సమ్మిట్‌కు ఆహ్వానిస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు.

ఆటోపై అ'భయ'హస్తం

- ఆటోవాలాలకు ఉపాధి కరువు
- ప్రాణ సంకటంగా ఉచిత ప్రయాణం
- ఇప్పటివరకు 21 మంది ఆత్మహత్య
- ఉత్తుత్తి హామీతో సరిపెట్టిన ప్రభుత్వం
- ఆర్థికసాయం అమలుపై మీన మేషాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం తీసుకున్న ఒక్క నిర్ణయం ఆటో డ్రైవర్లకు శరాఘాతంగా మారితే, ఆర్థికసాయంపై ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోకపోవడం వారికి ప్రాణ సంకటంగా మారింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వారి జీవితాలను దారుణంగా దెబ్బతీసింది. బతుకుదెరవు లేక భవిష్యత్తు అగమ్యగోచరంగా మారడంతో మనస్తాపం చెంది ఇప్పటివరకు 21 మంది ఆటో డ్రైవర్లు ప్రాణాలు తీసుకున్నారు. అయినప్పటికీ కండ్లు తెరవకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనమని ఆటో యూనియన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వాస్తవానికి ఆటోవాలాలకు ఆదాయం తెచ్చిపెట్టేది మహిళలే. పురుషులతో పోలిస్తే ఆటోలను ఎక్కువగా ఆశ్రయించేది వారే. ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణం కారణంగా వారు ఆటోలవైపు చూడడం మానేయడంతో ఆటో డ్రైవర్ల ఆదాయం గణనీయంగా పడిపోయింది. ఇది ముందే ఊహించిన ఆటో సంఘాలు ఉచిత ప్రయాణంపై ముందునుంచీ ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. ఇప్పుడు వారి ఆందోళన నిజమైంది. ఒక్కసారిగా గిరాకీ తగ్గి, రోజువారీ జీవనం కష్టంగా మారింది. ఈ వేదన భరించలేని కొందరు ఆత్మహత్యలతో విలువైన ప్రాణాలను తీసుకుంటున్నారు. మరికొందరు గుండెపోటుతో మరణించారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 21 మంది ఆటోకార్మికులు ప్రాణాలు తీసుకోవడంతో వారి కుటుంబాలు రోడ్డునపడ్డాయి.

హామీ గాలికి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆటో కార్మికులకు ఏటా రూ.12వేలు ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించింది. ఇప్పుడెలాగూ బతుకుదెరువు పోవడంతో ఆ సాయమేదో పెంచి హామీ నిలబెట్టుకోవాలని ఆటోకార్మికులు రోడ్లపైకి వచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదు. చర్చలకు సిద్ధమంటూ ఉత్తుత్తి ప్రకటనలకే పరిమితమైంది. ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీల్లో మరో రెండింటిని అమలు చేస్తామని రెండు రోజుల క్రితం ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అందులో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ ఊసు లేదు. బడ్జెట్ తర్వాత అమలు చేస్తారని అనుకోవడానికీ లేదు. ఎందుకంటే అప్పటికి ఎన్నికల కోడ్ వచ్చేస్తుంది. అంటే మార్చి, ఏప్రిల్ నెలలు కూడా కోడ్‌లో కలిసిపోతాయి. ఆటో కార్మికులను ఇది మరింత ఆందోళనకు గురిచేస్తున్నది. రెండు నెలల్లోనే 21 మంది మరణించారని, మరో రెండు మూడు నెలలు ఆగితే మరెన్ని ప్రాణాలు పోతాయోనని భయపడుతున్నారు.

మరో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

1పేజీ తరువాయి...

ఉంటూ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రభుత్వం రెండు నెలల కిందట మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో కరుణాకర్ ఉపాధి కోల్పోయాడు. దీంతో కుటుంబ పోషణ భారమైంది. తెచ్చిన అప్పులు తీర్చే దారిలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మధ్యాహ్నం నగర శివారులోని మార్క్‌ఫెడ్ ప్రాంతానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. ఆ వెంటనే భార్య పావనికి ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగినట్టు చెప్పాడు. ఆమె రాంనగర్ ఆటో స్టాండ్‌కు వచ్చి ఆటోడ్రైవర్లకు జరిగిన విషయం తెలిపింది. తోటి ఆటో డ్రైవర్లతో కలిసి అక్కడికి వెళ్లి చూడగా కరుణాకర్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. కరీంనగర్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. విగతజీవిగా కనిపించిన భర్తను చూసి భార్య బోరున విలపించింది. ఇక తమకు దిక్కెవరంటూ గుండెలు బాదుకుని రోదించింది. భార్య పావని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్టు సీఐ వెంకటేశ్ తెలిపారు.

ఇప్పటివరకు మరణించిన ఆటోడ్రైవర్లు

పేరు	ఊరు	మరణించిన తేదీ
పెండ్యాల సారయ్య	హుస్నాబాద్	14/12/2023
పీ సతీశ్‌గౌడ్	పంజాగుట్ట (హైదరాబాద్)	05/01/2024
నర్సయ్యగౌడ్	మెదక్	07/01/2024
సత్యనారాయణ	స్టేషన్‌ఘనపూర్	14/01/2024
ఎం అనిల్ కుమార్	చాంద్రాయణగుట్ట	16/01/2024
అనిల్	హైదరాబాద్	18/01/2024
షేక్ హమీద్	నారాయణగూడ	18/01/2024
అక్బర్	భద్రాద్రి కొత్తగూడెం	18/01/2024
ఎస్‌కే గులాం	నాగర్‌కర్నూల్	20/01/2024
ముదావత్ రాహుల్	రాజేంద్రనగర్ (హైదరాబాద్)	20/01/2024
ఎండీ షమీర్‌పాషా	మడికొండ	21/01/2024
ఉపేందర్	మిర్యాలగూడ	26/01/2024
బండ్ల మల్లేశ్	నాగార్జున సాగర్	26/01/2024
నగేశ్	హనుమకొండ	31/01/2024
అరుణ్‌కుమార్	హైదరాబాద్	01/02/2024
రమేశ్	వికారాబాద్	02/02/2024
నరేశ్	హైదరాబాద్	02/02/2024
తాళ్లపల్లి కిరణ్	వరంగల్	04/02/2024
చింతల రవి	కామారెడ్డి	05/02/2024
రామలింగయ్య	భద్రాద్రి కొత్తగూడెం	05/02/2024
కరుణాకర్	కరీంనగర్	07/02/2024

టీఎస్‌ఎస్‌పగా ఏపీఎస్‌ప

పేరు మార్చుకున్న సచివాలయ సంఘం

- తాత్కాలిక కమిటీని ఎన్నుకున్న సభ్యులు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఏర్పాటుకు ముందు ఉమ్మడి ఏపీలో ఉన్న ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం (ఏపీఎస్‌ఏ) పేరు మారింది. ఈ సంఘం పేరును తాజాగా తెలంగాణ రాష్ట్ర సచివాలయ సంఘం (టీఎస్‌ఎస్‌ఏ)గా మార్చారు. టీఎస్‌ఎస్‌ఏ అధ్యక్షుడిగా సురేశ్ ఎస్, ప్రధాన కార్యదర్శిగా ప్రేమ్ (జే దేవేందర్), ఉపాధ్యక్షురాలిగా బీ రాజేశ్వరి, కోశాధికారిగా వంశీధర్‌రెడ్డి ధర్మ, అదనపు కార్యదర్శిగా సుజిత్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా శివాజీ, స్వామిని ఎన్నుకున్నారు. కాలపరిమితిని 6 నెలలుగా నిర్ణయించారు.

సూక్ష్మ కళాకారుడి అరుదైన ఘనత

జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్ అరుదైన ఘనత సాధించాడు. 16,200 బియ్యం గింజలతో రూపొందించిన అయోధ్య రామమందిరానికి ఒకేసారి వరల్డ్ రికార్డ్స్, టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఇందుకు సంబంధించిన పత్రాలను బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సినీనటుడు బాబు మోహన్ దయాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు కళాకారులు, జగిత్యాలకు చెందిన ప్రముఖులు అభినందించారు. -జగిత్యాల టౌన్

భూవివాదం కేసును కొట్టివేయండి

మాజీ ఎమ్మెల్యే గండ్ర కుటుంబం పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన భూవివాద కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జ్యోతి చంద్ర, గండ్ర గౌతంరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఎల్ రాజలింగమూర్తి ఇచ్చిన ప్రైవేటు ఫిర్యాదు ఆధారంగా కింది కోర్టు ఆదేశాలతో పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని పిటిషన్‌లో హైకోర్టును కోరారు. పుల్లూరి రామలింగయ్యకు చెందిన రెండు కరాల స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించామని, అక్కడ ఆలయంతోపాటు వాణిజ్య సముదాయాన్ని నిర్మించడానికి ప్రయత్నించామని, బెదిరించామని ఫిర్యాదుదారు ఆరోపించిన దాంట్లో వాస్తవం లేదని పేర్కొన్నారు.నిరాధార ఆరోపణలతో ఫిర్యాదుచేస్తే పోలీసులు కేసు నమోదు చేశారని కోరారు. ఈపిటిషన్‌పై గురువారం విచారణ జరుపనున్నది.

నిజాలు దాచిన పిటిషనర్లకు లక్ష జరిమానా

భూ వివాదంలో హైకోర్టు తీర్పు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): వాస్తవాలను తొక్కి పెట్టి దురుద్దేశంతో కోర్టును ఆశ్రయించిన వ్యక్తులకు లక్ష జరిమానా విధిస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీకి ఆ మొత్తాన్ని చెల్లించాలని పిటిషనర్లను ఆదేశించింది. హైదరాబాద్ అంబర్‌పేటలోని సర్వే నంబర్ 57లో 2,432 చదరపు గజాల తమ స్థలంలో టీఎస్పీడీసీఎల్ జోక్యం చేసుకొని, ఖాళీ చేయించడానికి ప్రయత్నిస్తున్నదని పేర్కొంటూ ఆర్ మల్లేశ్ సహా నలుగురు హైకోర్టులో 2022లో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ కేసులో హైకోర్టు గతంలో యథాతథస్థితి ఉత్తర్వులను జారీ చేసింది. ఈ వ్యాజ్యాన్ని ఇటీవల జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ జరిపారు. పిటిషనర్ న్యాయవాది రాపోలు భాస్కర్ వాదిస్తూ, ఆ స్థలంలో శిథిలావస్థలో ఇల్లు ఉన్నదని, చట్టప్రకారం పరిహారం చెల్లించి టీఎస్ పీడీసీఎల్ తీసుకోవచ్చని చెప్పారు. దురుద్దేశంతో పిటిషన్ దాఖలు చేశారని హైకోర్టు తప్పుపట్టింది. పిటిషనర్లు పొందిన యథాతథస్థితి ఉత్తర్వులను రద్దు చేస్తూ, పిటిషనర్లు నలుగురు లక్ష జరిమానా చెల్లించాలని పేర్కొన్నది.

మెడికల్ కాలేజీలకు 'గుర్తింపు' గండం

- ఎన్‌ఎంసీ తనిఖీలకు ముంచుకొస్తున్న గడువు
- వసతుల కల్పనపై కనీసం సమీక్షించని ప్రభుత్వం
- గతంలో మంజూరైన సీట్లలో కోత పడే ప్రమాదం
- కొత్త కాలేజీల అనుమతులకు ముప్పు వాటిల్లే అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు 'గుర్తింపు' గండాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే మంజూరైన కాలేజీల్లోని సీట్లలో భారీగా కోత పడటంతో పాటు కొత్త కాలేజీల గుర్తింపు ప్రమాదంలో పడింది. ఉద్యమ నేత కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 9 ఏండ్ల లోనే 29 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసింది. వీటిలో 17 కళాశాలలు గత రెండేండ్లలోనే ఏర్పాటయ్యాయి. వాటిలో తరగతులు ప్రారంభించేందుకు కేసీఆర్ ప్రభుత్వం వసతులు కల్పించడంతోపాటు తదుపరి సంవత్సరానికి తగ్గట్టుగా జిల్లా దవాఖానల అప్‌గ్రేడేషన్‌కు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఏడాది మరో 8 కాలేజీల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. 17 కాలేజీల్లో సగటున 100 ఎంబీబీఎస్ సీట్లతో తరగతులు కొనసాగుతున్నాయి. ఈ కాలేజీల్లో ఈసారి ద్వితీయ, తృతీయ సంవత్సరం తరగతులు ప్రారంభించాల్సి ఉంటుంది. ఇందుకోసం నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) బృందం ఫిబ్రవరిలో తనిఖీలకు వచ్చే అవకాశం ఉన్నది. అయితే వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్ల ఈసారి సీట్లలో భారీగా కోతపడే ప్రమాదం పొంచి ఉన్నది. ద్వితీయ, తృతీయ సంవత్సరం తరగతుల బోధనకు తగినన్ని పడకలు, బోధన, బోధనేతర సిబ్బందితోపాటు, ఔట్ పేషంట్లకు చికిత్స, ఆపరేషన్లకు అవసరమయ్యే పరికరాలు ఉండాలి. ఈ ప్రమాణాలన్నీ ఉంటేనే కొత్త కాలేజీలకు అనుమతులు లభిస్తాయి. కానీ, వీటిపై వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు గానీ, డీఎంఈ గానీ ఇప్పటి వరకు సమీక్ష చేసిన దాఖలాలే లేవు.

అనుభవ లేమే అసలు సమస్య

ఇప్పటికే రాష్ట్రంలోని పలు కాలేజీలకు ఎన్ ఎంసీ నోటీసులు జారీ చేసింది. అధ్యాపకుల హాజరు, ఇతర వసతులపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. మెడికల్ కాలేజీలకు సంబంధించిన వ్యవహారాలన్నింటిని డీఎంఈ చూడాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం ఉన్న డీఎంసీ సహా, ఉన్నతాధికారులకు పెద్దగా అనుభవం లేకపోవడంతో ఆ లేఖలకు ఎలా సమాధానం ఇవ్వాలో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొన్నదని వైద్యశాఖ వర్గాలు వాపోతున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైద్యారోగ్య శాఖలో మంత్రి మొదలు అన్ని విభాగాలకు కొత్త హెచ్‌వోడీలు వచ్చారు. ప్రస్తుత ఇంచార్జి డీఎంఈకి మెడికల్ కాలేజీని గానీ, జిల్లా దవాఖానను గానీ నిర్వహించిన అనుభవం లేదు. డీఎంఈ కార్యాలయంలో అనుభవమున్న టీమ్ లేదు. హెల్త్ సెక్రటరీ క్రిస్టీనా జెడ్ చొంగ్తుది కూడా దాదాపు ఇదే పరిస్థితి. ఆమె స్వయంగా వైదురాలే అయినప్పటికీ ఎన్నో ఏండ్ల నుంచి వైద్యశాఖకు దూరంగా ఉన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహకు గతంలో వైద్యశాఖను నిర్వహించిన అనుభవం లేదు. దీంతో వారు ఎన్‌ఎంసీని ఎంత వరకు 'మేనేజ్' చేస్తారన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి చొరవ చూపితేనే 17 కాలేజీల అనుమతులు కొనసాగుతాయని, లేదంటే సీట్లలో భారీగా కోత పడే ప్రమాదం ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంచార్జి డీఎంఈల స్థానంలో డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ)ని ఏర్పాటు చేయడంతోపాటు సీనియారిటీ లిస్టులో వ్యవస్థపై పట్టు, అవగాహన ఉన్న వారిని రెగ్యులర్ డీఎంఈగా నియమించాలని సూచిస్తున్నారు.

కష్టపడి తెస్తే..

తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య 5 మాత్రమే. వీటిలో ఉస్మానియా (1946), గాంధీ (1954) మెడికల్ కాలేజీలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం కంటే ముందు నుంచే ఉన్నాయి. వరంగల్‌లోని ప్రైవేట్ సంస్థ ఏర్పాటు చేసిన కాకతీయ మెడికల్ కాలేజీని ఉమ్మడి ప్రభుత్వం తీసుకున్నది. అంటే.. దాదాపు 6 దశాబ్దాల్లో ఉమ్మడి పాలకులు తెలంగాణ ప్రాంతంలో ఆదిలాబాద్‌లో రిమ్స్, నిజామాబాద్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ మాత్రమే ఏర్పాటు చేశారు. దీంతో ఎంబీబీఎస్ విద్య కోసం రాష్ట్ర విద్యార్థులు విదేశాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. దీన్ని నివారించేందుకు నాటి సీఎం కేసీఆర్ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఆ హామీ మేరకు తొమ్మిదేండ్లలోనే 29 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారు. 2016-17లో మహబూబ్‌నగర్, సిద్దిపేట.. 2018-19లో నల్లగొండ, సూర్యాపేట.. 2022-23లో మంచిర్యాల, రామగుండం, జగిత్యాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సంగారెడ్డి.. 2023-24లో కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, జయంశంకర్ భూపాలపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగామ జిల్లాల్లో వైద్య కళాశాలలు ఏర్పాటయ్యాయి. 2024-25లో జోగులాంబ గద్వాల, నారాయణపేట, ములుగు, వరంగల్, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో మెడికల్ కాలేజీల ఏర్పాటుకూ గత ప్రభుత్వమే ఉత్తర్వులు జారీ చేసింది. ఎంతో కష్టపడి తెచ్చిన ఈ వైద్య కళాశాలలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిలబెట్టాలని వైద్యరంగ నిపుణులు సూచిస్తున్నారు.

సాయం చేస్తాం

- హైదరాబాద్ విద్యార్థికి భారత కాన్సులేట్ హామీ
- మమ్మల్ని అమెరికాకు పంపండి: బాధిత కుటుంబ సభ్యులు
- కేంద్ర మంత్రి జైశంకర్‌కు బాధితుడి భార్య లేఖ
- తెలుగు విద్యార్థులపై దాడి అమానుషం : సీఎం రేవంత్
- రాష్ట్రంలో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 7: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన హైదరాబాద్ విద్యార్థి మజార్ అలీపై ముగ్గురు దుండగులు విచక్షణా రహితంగా దాడి చేసి.. అతడిని దోచుకున్న సంఘటన అటు అమెరికాతో పాటు ఇటు ఇండియాలో సంచలనం రేకెత్తించింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో ఇప్పుడు వైరలయ్యాయి. అమెరికాలో ఉంటున్న భారతీయులపై వరుస దాడులు జరగటంపై దేశ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి తీవ్రంగా మారటంతో..షికాగోలోని భారత కాన్సులేట్ రంగంలోకి దిగింది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న స్థానిక అధికారులను కాన్సులేట్ సంప్రదించింది. ఆదివారం అమెరికాలోని ఇండియానా వెస్లియన్ యూనివర్సిటీలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో మాస్టర్స్ చదువుతున్న హైదరాబాద్‌కు చెందిన మజార్ అలీపై క్యాంప్‌బెల్ అవెన్యూలో దుండగులు దాడి చేసి దోచుకున్న సంగతి తెలిసిందే. మజార్ అలీ భార్య హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్‌లో తన ముగ్గురు చిన్నారులతో నివసిస్తున్నారు. భర్తపై దాడి జరిగిన విషయం తెలియగానే షాక్‌కు గురైన సయ్యదా రుక్వియా ఫాతిమా రజ్వీ వెంటనే విదేశాంగ మంత్రి జైశంకర్‌కి విజ్ఞప్తి చేసింది. తన భర్తకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చూడాలని కోరింది. అలాగే తన పిల్లలతో సహా తాను అమెరికా వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని కూడా కోరింది. దాడి జరిగాక తన భర్త తానుంటున్న అపార్ట్‌మెంట్ నుంచి బయటకు వెళ్లటానికి భయపడుతున్నాడని, ఈ సమయంలో తన భర్త పక్కన తానుండటం అవసరమని, తద్వారా అతను త్వరగా కోలుకుంటాడని ఆమె అభిప్రాయపడింది. కేంద్ర మంత్రి జైశంకర్‌కి ఫాతిమా లేఖ అందగానే షికాగోలోని భారత కాన్సులేట్ రంగంలోకి దిగింది. హైదరాబాద్‌లో ఉన్న మజార్ అలీ భార్యతో సంప్రదింపులు జరుపుతున్నామని..బాధితుడికి అవసరమైన అన్ని రకాల సహాయం చేస్తామని భారత కాన్సులేట్ తన అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో పేర్కొన్నది.

అమెరికాలో భారతీయులపై కొనసాగుతున్న దాడులు

అమెరికాలో గతంలో ఎన్నడూ లేనంతగా భారతీయులపై దాడులు జరుగుతున్నాయి. మరికొందరు అనుమానాస్పదస్థితిలో ప్రాణాలు కోల్పోతున్నారు. జనవరి మొదలు వరుసగా భారతీయ విద్యార్థులపై జరుగుతున్న దాడులు కలవరపెడుతున్నాయి. ఇటీవల ఇండియానాలోని పర్‌డ్యూ యూనివర్సిటీలో భారతీయ విద్యార్థి శవమై కనిపించగా, తాజాగా షికాగోలో భారతీయ ఐటీ విద్యార్థిపై దారుణ దాడి జరిగింది. తాజా ఘటన ఈ ఏడాదిలో ఆరోది. పర్‌డ్యూ యూనివర్సిటీలోని మెకానికల్ ఇంజినీరింగ్ డాక్టోరల్ విద్యార్థి సమీర్ కామత్ (23) మృతదేహం సోమవారం వారెన్ కౌంటీలో కనిపించింది. షికాగోలో ఆదివారం జరిగిన మరో ఘటనలో భారతీయ ఐటీ విద్యార్థి సయ్యద్ మజార్ అలీ దారుణంగా గాయపడ్డాడు. ముగ్గురు వ్యక్తులు అతడిని చేజ్ చేసి ముఖంపైన, పక్కటెముకల్లో పిడిగుద్దులు కురిపించారు. తీవ్రంగా గాయపడిన అలీ స్థానిక దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ముక్కు పగిలి రక్తం కారుతూ, ముఖమంతా రక్తపు మరకలతో ఉన్న వీడియోను సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో షేర్ చేసిన అలీ తనపై దాడి ఘటనను వివరించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఆరు నెలల క్రితమే అతడు ఉన్నత విద్య అభ్యసించేందుకు అమెరికా వెళ్లాడు. దుండగులు అతడికి తుపాకి కూడా గురిపెట్టినట్టు ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు. ఇండియానా వెస్లేయన్ యూనివర్సిటీలో అలీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో మాస్టర్స్ చదువుతున్నాడు. గతవారం ఓహియోలోని లిండెర్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో చదువుతున్న 19 ఏండ్ల శ్రేయాస్‌రెడ్డి బెనిగెర్ శవమై కనిపించాడు. గత నెల 28న పర్‌డ్యూ యూనివర్సిటీ విద్యార్థి నీల్ ఆచార్య కూడా అనుమానాస్పదస్థితిలో మరణించాడు. అంతకుముందు జనవరి 16న లిథోనియా నగరంలో 25 ఏండ్ల వివేక్ సైనీ డ్రగ్స్‌కు బానిసైన వ్యక్తి చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. అంతకంటే ముందు హైపోథెర్మియాతో బాధపడుతూ ఇల్లినాయిస్ యూనివర్సిటీ విద్యార్థి అకుల్ డీధావన్ మృతి చెందాడు. అమెరికాలో భారతీయుల వరుస మరణాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. 2023 నవంబర్ ఓపెన్‌డోర్స్ నివేదిక ప్రకారం యునైటెడ్ స్టేట్స్‌లో చదువుతున్న ఒక మిలియన్ విదేశీ విద్యార్థుల్లో 25